‘కళ’తప్పిన జాతర..

దయనీయంగా బొమ్మలు, ఆకృతులు ● అందాల శిల్పారామంలో పేరుకుపోతున్న నిర్లక్ష్యపు తుప్పు



శిల్పారామం ముఖద్వారం

పీఎంపాలెం : గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే మధురవాడ శిల్పారామం (జాతర) నిర్వహణ లోపంతో పూర్వ కళా వైభవాన్ని కోల్పోతోంది. రాష్ట్ర విభజనకు ముందు హైదరాబాద్ శిల్పారామం ఆధ్వర్యంలో నిధులు వచ్చేవి. విభజన తరువాత కష్టాలు మొదలయ్యాయి. ప్రస్తుతం నిధులు అంతంతమాత్రంగా వస్తుండడంతో నిర్వహణ భారంగా మారింది. పర్యాటకుల్ని మరింతగా ఆకట్టుకునేందుకు ఏర్పాటు చేసిన వివిధ బొమ్మలు, ఆకృతులు రంగులు వెలిసి, బీటలు వారి దయనీయంగా కనిపిస్తున్నాయి. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమను అందరూ స్ఫూర్తిగా తీసుకొనేలా రూ.5లక్షలతో ఏర్పాటు చేసిన అల్లూరి మ్యూజియం నిరుపయోగంగా మారింది.

పిచ్చి మొక్కల నడుమ తథాగతుడు

గతంలో కోనేరు వద్ద వంతెన నిర్మించి బుద్ధుని విగ్రహం ఏర్పాటు చేశారు. విద్యుత్ కాంతులతో ఆ ప్రదేశం ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. అధికారులు, నిర్వాహకులు నిర్లక్ష్యం కారణంగా కోనేరు ఎండిపోయింది. అందులో పిచ్చిమొక్కలు మొలిచాయి. ఆ



పిచ్చి మొక్కల మధ్యలో బుద్ధుని విగ్రహం

పిచ్చి మొక్కల మధ్య బుద్ధుని విగ్రహం దర్శనమిస్తోంది. పాలు నురుగులో తళతళమెరిసే జోడెడ్లతో పొలం దున్నతున్న రైతు కళారూపం మరో ఆకర్షణగా ఉండేది. ప్రస్తుతం ఈ కళారూపం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి.

మసకబారిన అల్లూరి మ్యూజియం

ఇక్కడకు వచ్చే సందర్శకులను ఆకర్షించే విధంగా నిర్మించిన విప్లవ వీరుడు అల్లూరి సీతామరాజు జీవిత చరిత్రను గుర్తు చేస్తూ.. ఆ మ్యూజియం ఏర్పాటు చేశారు. నిర్వహణను గాలికొదిలేయడంతో మ్యూజియంలోని శిల్పాలు శిథిలమయ్యాయి. శిల్పారామం నిర్వహణలో నిర్లక్ష్యంపై స్థానిక అధికారి విశ్వనాథరెడ్డి వద్ద ప్రస్తావించగా శిల్పారామంలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి నివేదిక రూపొందించి త్వరలోనే అవసరమైన చర్యలు చేపడతామన్నారు.



తుప్పు పట్టిన కళారూపాలు



పిచ్చి మొక్కలు మధ్య కాడెద్దు



అలంకార ప్రాయంగా పక్షుల గూడు



నిరుపయోగంగా అల్లూరి మ్యూజియం



భీమునిపట్నం: భీమిలి గోస్తని నదిలోకి వరద నీరు పెద్ద ఎత్తున చేరింది. అరకు కొండల్లోంచి వచ్చే గోస్తని నది ఇక్కడ సముద్రంలోకి కలుస్తుంది. దీనినే సాగరసంగమ ప్రాంతమని అంటారు. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోస్తనిలోకి భారీగా వరద నీరు రావడంతో నది పోటెత్తుతోంది.

క్లుప్తంగా

కుంగిన గణేష్ థియేటర్ కూడలి రహదారి



చిట్టివలస గణేష్ థియేటర్ కూడలి వద్ద కుంగిన రహదారి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు చిట్టివలస గణేష్ థియేటర్ కూడలి నుంచి చావుల మదుం వైపు వెళ్లే మార్గంలో రహదారి కుంగిపోయింది. భీమిలి మున్సిపాల్టీగా ఉన్న సమయంలో నిర్మించిన డ్రైనేజీని ఆధునీకరణ చేయకుండానే తరువాత కాలంలో పలుమార్లు బీటీరోడ్డును పునరుద్ధరించారు. తరచూ ఈ ప్రాంతంలో భారీ వాహనాలు రావడంతోనే పురాతనమైన డ్రైనేజీ దానిపై రహదారి శిథిలం కావడంతో కుంగిపోతున్నట్టు స్థానికులు తెలిపారు. వెంటనే కుంగిన ప్రాంతాన్ని పునర్ నిర్మించాలని చిట్టివలస వాసులు కోరుతున్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు.

చురుగ్గా సభ్యత్వ నమోదు



మాట్లాడుతున్న నరేంద్ర మోహన్

భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గ పరిధిలో పార్టీ సభ్యత్వ నమోదును చురుగ్గా నిర్వహించాలని బీజేపీ నేత కేతినేని సురేంద్ర మోహన్ అన్నారు. ఆదివారం ఇక్కడ నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో పార్టీకి మంచి గుర్తింపు ఉందని దానికి తగిన విధంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా సభ్యత నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. నాయకులు ఉప్పాడ అప్పారావు, వాసుపల్లి శ్రీహరి, ప్రసారావు పట్నాయక్, కంటుభుక్త సునీత, పోలుబోతు విజయ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు

భీమునిపట్నం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులు ఆంధ్రప్రదేశ్ మెడికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ తమకు కనీస వేతనాలు సకాలంలో చెల్లించాలని, మహిళ వర్కర్లకు తగిన సదుపాయాలు కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవాని, ఎస్.లక్ష్మి, బీ.వెంకటలక్ష్మి, ఎల్లాజి, పెంటయ్య, ఈశ్వరమ్మ, యూనియన్ నాయకులు కొండపు ఈశ్వరరావు, రాంబాబు, అప్పలరాజు పాల్గొన్నారు.

చిట్టివలస కళ్లాల్లో బురద



బురద మయంగా చిట్టివలస కళ్లాలకు చేరుకునే మార్గం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు చిట్టివలస శివారులోని కళ్లాలకు వెళ్లే రహదారి బురదమయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ మార్గం చెరువులా తయారైంది. గతంలో శారద పబ్లిక్ స్కూల్ పరిసరాల వరకు సీసీ రోడ్లు, డ్రైనేజీలు వేసి చేతులుతలుపుకున్నారు. దీని తరువాత సుమారు 500 మీటర్ల వరకు కాలిబాటల ద్వారా నడిచి వెళితే విజయనగరం జిల్లాకు అనుకుని 200 కుటుంబాల ప్రజలు నివశించే చిట్టివలస కళ్లాలు గ్రామంతో పాటు ఆ పక్కనే విజయనగరం జిల్లాకు చెందిన శ్రీరామ్‌నగర్ గ్రామం ఉంది. శ్రీరామ్‌నగర్ వాసులు జ్యూట్‌మిల్లు అవుట్‌గేట్ మీదుగా రాకపోకలు సాగించినా కళ్లాలకు చెందిన వారు బొగ్గురోడ్డులోని దుర్గాలమ్మ ఆలయం ఎదురుగా ప్రవేశించి శారదా పబ్లిక్ స్కూల్ వెనుక భాగం ద్వారా తమ గ్రామాలకు చేరుకోవలసి ఉంటుంది. గతంలో పలుమార్లు సర్వే జరిపినా కళ్లాలకు రోడ్డు సాకారం కావడం లేదు. దీంతో వర్షాలు కురిసిన ప్రతిసారి ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు మాత్రం ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కళ్లాలకు చేరుకునేందుకు పక్కా రహదారి నిర్మించాలని అక్కడివారు కోరుతున్నారు.

5 నుంచి హిందీ పరీక్షల హాల్ టికెట్ల పంపిణీ

తగరపువలస: ఈ నెల 14, 15వ తేదీలలో జరగనున్న దక్షిణ భారత హిందీ ప్రచార సభ లోయర్, హయ్యర్ పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు హాల్ టికెట్లు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు ఆదర్శ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఆదివారం ఓ ప్రకటన పేర్కొన్నారు. వివరాల కోసం 89856 47419, 89858 97419 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇంటి పన్నులు వేయండి మహాప్రభో..

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు కొండపేట గ్రామంలో కొన్ని ఇళ్లకు ఇంటి పన్నులు వేయమని వేడుకుంటున్నా జీవీఎంసీ, వార్డు సచివాలయ సిబ్బంది స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. చిట్టివలస సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం వెనుక కొండవాలు ప్రాంతంలో పదుల సంఖ్యలో 12 ఏళ్లుగా ఇళ్లకు పన్నులు వేయడం లేదు. దీంతో వీరు నివశిస్తున్న ఇళ్లకు నంబర్లు లేకపోవడం వలన ఇంటింటా కుళాయిలు కూడా వేయించుకోకపోతున్నట్టు వాపోతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి ఇంటి పన్నులు వేయాలని కోరుతున్నారు.

మధురవాడలో పలువురు అధికారులకు బదిలీ

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మధురవాడ పరిధిలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న అధికారులకు బదిలీలయ్యాయి. విశాఖ నార్త్ సబ్ డివిజన్ పోలీసు ఏసీపీ బి. సునీల్ ఇటీవల బదిలీ చేసి వీఆర్‌కి అటాచ్ అయ్యారు. దిశ పోలీస్ స్టేషన్ ఏసీపీగా పనిచేసిన వివేకానందకు బదిలీకాగా.. ఆయన స్థానంలో సీహెచ్ పెంటారావు బాధ్యతలు చేపట్టారు. పీఎంపాలెం లా అర్డర్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న వై. రామకృష్ణను ఉన్నతాధికారులు వీఆర్‌కి అటాచ్ చేశారు. ఆయన స్థానంలో బాలకృష్ణ రానున్నారు. క్రైం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రాంబాబు విశాఖ రేంజ్‌కు అటాచ్ చేయగా.. ఆయన స్థానంలో విజయనగరం పీటీసీ నుంచి సత్యశివ ప్రకాష్ రానున్నారు.

జెడ్సీ శైలజా వల్లికి బదిలీ

జీవీఎంసీ జోన్–2 కమిషనర్‌గా పనిచేస్తున్న జి. శైలజావల్లిని మాతృ సంస్థ రాజమహేంద్ర వరం అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ కార్యదర్శిగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో పి.సింహాచలానికి పోస్టింగ్ ఇచ్చారు.

వినాయక నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

పీఎంపాలెం: స్థానిక ఆఖరు బస్టాపు నుంచి బక్కన్నపాలెంకు వెళ్లే రోడ్డులోగల అంజనాద్రిపై వెలసిన శ్రీ శృంగేరీ శంకరమఠంలో ఈ నెల 7వ తేదీనుంచి 15వ తేదీవరకూ శ్రీ సిద్ధివినాయక స్వామి వారి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు మఠంగౌరవ కార్యనిర్వాహణ అధికారి జగర్లపూడి వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజూ ఉదయం 8 గంటలనుండి మహా రుద్రాభిషేకం, గణపతికి విశేష అలంకరణ, వినాయక చతుర్థి వ్రతాలు నిర్వహించనున్నారు.

కూలిన పురాతన ఇల్లు



రహదారిపై పడిన శిథిలాలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు కొత్తపేటలో ఓపాతబడిన ఇల్లు శనివారం రాత్రి కూలిపోయింది. కుటుంబ తగాదాల నేపథ్యంలో ఆ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.అయితే ఈ ఇంటి చుట్టూ చిన్నారులు నిత్యం ఆటలాడుకుంటారని, కూలిపోయే సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. శిథిలమైన పాత ఇళ్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు జీవీఎంసీ సిబ్బంది రహదారిపై పడిన ఇంటి శిథిలాలను ఆదివారం తొలగించారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

తగరపువలస: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సోమవారం పలు ప్రాంతాల్లో నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు. భీమిలి మండలంలోని టి.నగరపాలెం, ఆనందపురం కూడలి, తగరపువలస అంబేడ్కరు కూడలిలో వర్ధంతి కార్యక్రమాలు జరుగుతాయని గాడు శ్రీను, బంక సత్యం, జగుపల్లి ప్రసాద్, పార్టీనేతలు పేర్కొన్నారు.

వర్షాలతో అప్రమత్తం



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి సునీత

పద్మనాభం: తుపాను పట్ల మండల స్థాయి అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని తుపాన్-సంరక్షణ చర్యల మండల ప్రత్యేక అధికారి డి.సునీత అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించకుండా చూడాలన్నారు. తాగు నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, తహసీల్దార్ సీహెచ్ ఆనంద్ కుమార్, ఈవోఆర్డీ కుమార్, మండల పరిషత్ ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కనకమ్మ ఆలయంలో చోరీ



ఆలయం తలుపు విరగ్గొట్టిన దొంగలు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీలోని కొండశివారు ప్రాంతంలో ఉన్న కనకమ్మ ఆలయంలో శనివారం రాత్రి దొంగలు పడ్డారు. ఆలయం తలుపు విరగ్గొట్టి లోపల ఉన్న రెండు హుండీల నుంచి రూ.5 వేల వరకు చోరీ చేశారు. ఆదివారం భీమిలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

నాలుగు గ్రామాల్లో ఈ -పంట నమోదు

పద్మనాభం: మండలంలోని నాలుగు గ్రామాల్లో ఆదివారం గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ- పంట నమోదు చేశారు. కృష్ణాపురం, మద్ది, పాండ్రంగి, పొట్నూరు గ్రామాల్లో ఈ-పంట నమోదు చేశారు. ఈ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం పర్యవేక్షించారు.

ఉత్సాహంగా ఉట్టి కొట్టే సంబరం



వెంకటాపురంలో ఉట్టి కొట్టే సంబరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండలంలోని వెంకటాపురంలో ఆదివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎంపీపీ కంటుబోతు రాంబాబు శ్రీకృష్ణుడి విగ్రహం వద్ద పూజలు నిర్వహించి ఉట్టి కొట్టే సంబరాన్ని ప్రారంభించారు. చిన్నా, పెద్దా తారతామ్యం లేకుండా అందరూ ఉట్టిని కొట్టేందుకు పోటీ పడ్డారు. రేవిడి ఎంపీటీసీ సీర సూరప్పడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటాపురం సర్పంచ్ కె.రమణ, రేవిడి మాజీ ఎంపీటీసీ ఎ.గంగరాజు, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, ఎన్.వెంకటరావు పాల్గొన్నారు.

ముగ్గురమ్మలకు విశేష పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

మధురవాడ: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొమ్మాది జంక్షన్ వద్ద త్రిశక్తి ఆలయంలో కొలువైన ముగ్గురు అమ్మలకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని శ్రీ బంగారమ్మ, ఎర్నమ్మ, దండుమారమ్మలకు నిత్యార్చనతో పూజలు ప్రారంభించి పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు నిష్టల రాంబాబు శర్మ ఆధ్వర్యంలో కుంకుమ, పుష్పార్చనలు జరిపించారు. ఈ సందర్భంగా మధురవాడ పరిసర 14 గ్రామాలు స్వయంకృషినగర్, ముత్యాలమ్మ కాలనీ, స్వతంత్రనగర్, బొట్టవానిపాలెం, చంద్రంపాలెం తదితర పరిసర గ్రామాలకు చెందిన భక్తులు విశేషంగా హాజరై అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, సెక్రటరీ మొల్లి లక్ష్మణ, ఉపాధ్యక్షుడు పిల్లా పాపారావు, కోశాధికారి వాండ్రాసి అప్పలరాజు, సహాయ కార్యదర్శి కుదితి రామారావు, కార్యవర్గ సభ్యులు పిల్లా సూరిబాబు, వాండ్రాసి సన్యాసిరావు, పిల్లా అప్పన్న తదితరులు పర్యవేక్షించారు.

చిరంజీవికి పదవీ విరమణ సత్కారం



చిరంజీవిరావును సత్కరిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్ తదితరులు

పద్మనాభం: ఇష్టపడి పని చేసినప్పుడే సత్ఫలితాలు వస్తాయని విద్యాశాఖ ఆర్జేడీ కె.విజయ భాస్కర్ అన్నారు. మండలంలోని రెడ్డిపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన వెదుళ్లవలస చిరంజీవిరావుకు పాఠశాల ఆవరణలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు మాట్లాడుతూ చిరంజీవిరావు ఉపాధ్యాయుడుగా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఈర్ల ఈశ్వరరావు, విజయనగరం డీఈవో ప్రేమ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కె.దామోదరరావు, డీసీసీబీ కార్యదర్శి ఎం.వి.కృష్ణ కుమార్, రెడ్డిపల్లి హైస్కూల్ హెచ్‌ఎం ఆర్.సన్యాసిరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు..

తగరపువలస: భీమిలి మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చెట్టి సింహాచలం ఉద్యోగ విరమణ సందర్భంగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, ఆర్జేడీ కె.విజయభాస్కర్, గంటా నూకరాజు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు సత్కరించారు.

రాజ్యలక్ష్మి ఆలయ భూములను రక్షించాలి



రాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయ భూమిలో వేసిన షెడ్డు

పద్మనాభం: మండలంలోని ఐనాడలోని రాజ్యలక్ష్మి అమ్మ వారి ఆలయ భూములను పరి రక్షించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆలయ ట్రస్టీ మామిడి శివ రామకృష్ణ కోరారు. ఐనాడలో సర్వే నంబర్ 5/2లో రాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి 7.34 ఎకరాల భూమి ఉందని తెలిపారు. దీనిలో 30 సెంట్లు భూమిని సచివాలయం, వెల్ నెస్ సెంబర్ నిర్మాణానికి కేటాయించామని చెప్పారు.

ఇంకా ఆలయానికి 7.04 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూమి మధ్యలో ఇద్దరు వ్యక్తులు అక్రమంగా షెడ్లు నిర్మాంచారని తెలిపారు. గతంలో ఒక సారి అక్రమించగా రెవెన్యూ అధికారులు తొలగించారని పేర్కొన్నారు. మళ్లీ ఇప్పుడు అక్రమించి షెడ్లు వేశారని తెలిపారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి షెడ్లు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

పర్యాటకుల తాకిడి



రుషికొండ బీచ్‌లో పర్యాటకుల సందడి

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకుల తాకిడి పెరిగింది. తుపాను నేపథ్యంలో వారం రోజుల నుంచి పర్యాటక ప్రాంతాలన్నీ బోసిపోయాయి. వర్షాలు, ఈదురు గాలులు వలన అందరు ఇంటికే పరిమితమయ్యారు. ఆదివారం వర్షం తగ్గుముఖం పట్టడంతో రుషికొండ బీచ్, సాగర్‌నగర్ బీచ్, మంగమారిపేట బీచ్, భీమిలి బీచ్ ప్రాంతాల్లో పర్యాటకుల తాకిడి పెరిగింది. ఇదిలా ఉండగా వర్షాలు తగ్గినప్పటికీ సముద్రంలో కెరటాలు పెద్ద ఎత్తున ఎగసి పడటంతో లైఫ్‌గార్డ్స్ పర్యాటకులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. రుషికొండ బీచ్‌లో బోటు షికారును ప్రస్తుతానికి నిలిపివేశారు.

కొండవాలు ప్రాంతాల పరిశీలన



మధురవాడ ముత్యాలమ్మ కాలనీలో పర్యటిస్తున్న అధికారులు

మధురవాడ: వాయుగుండం కారణంగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల నేపథ్యంలో అధికారులు మధురవాడలోని జీవీఎంసీ 5, 7 వార్డుల్లోని పలు ప్రాంతాలలో పర్యటించారు. విశాఖ రూరల్ మండల ప్రత్యేక అధికారి, సివిల్ డిఫెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. పద్మలత ఆధ్వర్యంలో తహసీల్దారు పాల్ కిరణ్, జోన్–2 కమిషనర్ శైలజావల్లి తదితరులు కొండ వాలు ప్రాంతాలు, ముంపుకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాలు పరిశీలించారు. కొండచరియ జారిపడిన వికలాంగుల కాలనీ, ముత్యాలమ్మ కాలనీతో పాటు శివశక్తినగర్ రోడ్డులో ఉన్న కొండవాలు ప్రాంతాలతో పాటు, సాయిరాం కాలనీ ప్రాంతాలు కూడా పరిశీలించారు. టీపీవో వరప్రసాద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.